క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ రాజకుమార్

సాలూరు : పట్టణంలో నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా శనివారం జరిగింది. పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాల్లో ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన ఈ పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే విద్యార్థులు, వారి వెంట తల్లిదండ్రులు రావడం కనిపించింది. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 144 మంది విద్యార్థులకుగాను 134 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 161 మంది విద్యార్థులకు 131 మంది హాజరయ్యారు. డబ్బివీధి పాఠశాలలో 161 మంది విద్యార్థులకు 112 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాలను డిప్యూటీ ఈఓ రాజకుమార్ పరిశీలించారు.

పైపులైన్ మరమ్మతు పనులు



కవిరిపల్లిలో మరమ్మతు పనులు

మక్కువ: మండలంలోని కవిరిపల్లి గ్రామంలో తాగునీటి కుళాయిల పైపులైన్ మరమ్మతు పనులను శనివారం చేపట్టారు. మరో వారం రోజుల్లో ముత్యాలమ్మ పండగ జరగనుంది. గ్రామస్తులు, బంధువులు ఇబ్బంది పడకుండా సమృద్ధిగా తాగునీటి సరఫరాకు వీలుగా ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బంది పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. వీటిని సర్పంచ్ అలమండ సుధారాణి పర్యవేక్షించారు.

అండగా ఉంటాం..



కోడిశలో మౌనిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని పలువురు మృతుల కుటుంబాలను పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం పరామర్శించారు. కొత్తగూడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సవర భారతి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కోడిశకు చెందిన ఎస్.మౌనిక ఇటీవల క్యాన్సర్‌తో బాధ పడుతూ మృతి చెందింది. ఆమె తండ్రి కృష్ణ సైతం క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ కుటుంబాన్ని పరామర్శించారు. పీజేగూడకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సవర సన్నాయి అనారోగ్యంతో మంచాన పడడంతో ఆయన్ను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మామిడికి మంచు దెబ్బ



రాలిపోతున్న మామిడి పూత

- రాలిపోతున్న పూత
- సెక్టార్ పరిధిలో 650 ఎకరాల్లో మామిడి సాగు
- ఎకరాకు రూ.45 వేలకు పైగా ఖర్చు
- ఆందోళన చెందుతున్న రైతులు



కురుస్తున్న పొగ మంచు

సీతానగరం:

అకాల వర్షాలు, వాతావరణంలో మార్పులు, దట్టమైన పొగ మంచు మామిడి రైతులకు శాపంగా మారాయి. గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో వరుస వర్షాలు కారణంగా భూమిలో తేమ శాతం పెరగడమే కాకుండా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న పొగ మంచు దీనికి తోడై మామిడి పూతను దెబ్బతీస్తుంది. సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో మామిడి పూత వచ్చి, ఫిబ్రవరి, మార్చి నెల్లో పిందెలు కాసేవి. నెల రోజులుగా దట్టమైన మంచు కురవడం వలన పూత రాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. జనవరి నెల గడుస్తున్నా ఇంతవరకు పూత అంతంతమాత్రంగానే రావడంతో రైతులు దిగాలు పడుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 3 వేల ఎకరాలు, బలిజిపేట, సీతానగరం మండలాల్లో 650 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఇందులో 65 శాతం చెరకురసాలు, బంగినిపిల్లి, హిమాం ప్రసాదం, మెట్టవల్సపీసు, బొబ్బిలిపీసు, సువర్ణరేఖ, తినేగన్నేరు, కలక్టరు, నీలం, 361రకం, ఏనుగుమామిడి, రాణితలకాయి వంటి రకాల తోటలు ఉన్నాయి.

సలహాలు, సూచనలు ఇవ్వాలి

ఉద్యాన పంటల సీజన్లలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఉద్యాన శాఖ (హార్టీకల్చర్) అధికారులు మామిడి తోటలను పట్టించుకోవడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. వచ్చిన మామిడి పూత రాలకుండా కొత్త పూత వచ్చేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అధికారులు అవగాహన కలిగించాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకూ సూచనలు సలహాలు ఇచ్చిన దాఖలాల్లేవు. పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఎక్కడా హార్టీకల్చర్ అధికారులు పాల్గొన్న దాఖలాల్లేవు. దీంతో రైతులే సొంతంగా మందులు పిచికారీ చేసుకుంటున్నారు. అధికారులు మామిడి తోటలను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఇప్పటికే పూత రావాల్సింది



గతంలో ఈ సమయానికి మామిడి చెట్లకు పూత బాగా వచ్చేది. తేమ శాతం ఎక్కువ కావడమో.. లేక వాతావరణ ప్రభావమో తెలియడంలేదుగానీ... వచ్చిన పూతపై మంచు కురవడంతో రాలి పోతుంది. గత ఏడాది కూడా ఆశించిన స్థాయిలో పూత, దిగుబడి లేక చాలా నష్టపోయాం. ఈ ఏడాది కూడా పూత రాకపోవడంతో ఆందోళనగా ఉంది. మామిడి రైతులను ఆదుకోవాలి.

– బి శంకరరావు ,రైతు, గుచ్చిమి, సీతానగరం

వాతావరణంలో మార్పుల ప్రభావం

ఇటీవల వరుస తుఫాన్లు వచ్చిన కారణంగా మంచుకురవడం వలన వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. జిల్లాలో అక్కడక్కడ మామిడి చెట్ల నిండా పూత వచ్చింది. వాతావరణ ప్రభావం కారణంగా పూత ఆలస్యమైంది. వచ్చిన పూత రాలిపోతుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పూత రాలేదని అధిక మొత్తంలో ఎరువులు, మందులు వినియోగిస్తే ఖర్చులు పెరిగిపోవడమేకాక నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

– ప్రత్యూష, ఎంహెచ్ఓ, సీతానగరం, బలిజిపేట

చెత్త నుంచి సంపద సృష్టించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి కరుణాకర్

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో గ్రీన్ అంబాసిడర్లతో సేకరించిన తడి – పొడి చెత్త నుంచి సంపద తయారు చేసి ఎరువుగా ఉపయోగించి ఆర్థికంగా పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని జిల్లా పరిశ్రమల మేనేజరు, మండల ప్రత్యేకాధికారి ఎంవీ కరుణాకర్ అన్నారు. పెదబోగిలిలో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించడం అభినందనీయమన్నారు. అన్ని గ్రామాల ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో పంచాయతీ పాలక వర్గాల ఎరువు తయారు చేయాలన్నారు. ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీలు పని చేస్తున్నాయన్నారు. సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, గరికయ్య, ఇన్‌చార్జి ఈఓ ఇ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులను చైతన్యవంతం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ దీనకుమార్

సీతానగరం: గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి, పాడి రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం పశువైద్యాధికారులపై ఉందని పశుసంవర్ధక శాఖ ఏడీ సీహెచ్ దీనకుమార్ అన్నారు. స్థానిక పశువైద్య సబ్ డివిజన్ కార్యాలయంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు అధ్యక్షతన బలిజిపేట, సీతానగరం మండలాల పశువైద్యాధికారులు గ్రామీణ పశువైద్యాధికారులు, పశుసంవర్ధక శాఖ సహాయకులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్ దీనకుమార్ మాట్లాడుతూ సోమవారం నుంచి గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలతో పాటు పాడి రైతులను చైతన్య పర్చడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పాడి రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బలిజిపేట, చిలకలపిల్లి, అరసాడ, కోటసీతారాంపురం పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట : ఎంపీడీఓ కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజల సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ

స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల శనివారం ర్యాలీలు నిర్వహించారు. పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. సచివాలయ సిబ్బంది, గ్రామాల పెద్దల సహకారంతో ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. ర్యాలీల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. పలు గ్రామాల్లో స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజా సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. ప్రభుత్వ కార్యక్రమల్లో అందరూ భాగస్వాములై లక్ష్యాల వైపు అడుగు వేయాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురం టౌన్: వైద్యారోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో చెత్తను ఊడ్చి తొలగిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు



సీతానగరం: చెత్తకుప్పలకు మంట పెడుతున్న ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ పద్మావతి



సీతానగరం: ర్యాలీలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

హెల్మెట్ తప్పనిసరి



వీరఘట్టం: హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. వీరఘట్టం – పాలకొండ రోడ్డులో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి ప్రయాణాలు సాగించిన వారిని అభినందించారు. హెల్మెట్ ధరించని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పరిమిత వేగంతో రాకపోకలు సాగించాలని సూచించారు.

హెల్మెట్ పెట్టుకో... ప్రాణాలను రక్షించుకో..

గరుగుబిల్లి: దిచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్సై పి.రమేష్‌నాయుడు సూచించారు. మండలంలోని నందివానివలస వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదన్నారు. అధిక వేగంతో ప్రయాణాలు సాగిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌సీ చిన్నారావు, సిబ్బంది శంకరరావు, తదితరులున్నారు.



సీతంపేట: అవగాహన సదస్సు నిర్వహిస్తున్న పోలీసులు

తప్పనిసరి..

సీతంపేట: హెల్మెట్‌ధారణ తప్పనిసరని ఎస్సై అమ్మన్నరావు తెలిపారు. మండల కేంద్రంలో వాహనచోదకులకు హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ దివస్ ర్యాలీ



మక్కువలో ర్యాలీ చేపడుతున్న ఎంపీడీఓ స్వరూపరాణి, అధికారులు

మక్కువ: మక్కువ మండల కేంద్రంలో శనివారం ఎంపీడీఓ డి.డి స్వరూపరాణి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీఓ స్వరూపరాణి కోరారు.



సాలూరు: పట్టణంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న మంత్రి సంధ్యారాణి, జాయింట్ కలెక్టర్ శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ తదితరులు

అంచనాల్లేవు.. పరిహారమూ.. లేదు...!

- తుఫాన్ పంట నష్టంపై స్పందించని సర్కార్
- అంచనాలు వేయని వ్యవసాయ శాఖ
- అన్నదాత ఆందోళన

బలిజిపేట:

ఇటీవల సంభవించిన తుఫాన్ ప్రభావంతో రబీ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినా వ్యవసాయ శాఖ పంట నష్టాలను అంచనా వేయకపోవడం, ప్రభుత్వ పరంగా పరిహారం ప్రస్తావన లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయిలు వెచ్చించి మొక్కజొన్న, అపరాలు, పుచ్చకాయల పంటలను రైతులు వేశారు. తుఫాన్ ప్రభావంతో ఈ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే జరిగిన నష్టాన్ని అంచనా వేయాల్సిన అధికారులు కిమ్మనకుండా ఉండడంతో రైతుల్లో అనుమానాలు మొదలయ్యాయి. తమ పంట నష్టం లెక్క కట్టరా...పరిహారం ఇవ్వరా...అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి సర్కార్ రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెబుతూనే ఇలా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో నష్టపోయిన వాటికి ప్రభుత్వం ఆదుకోవడం సహజసిద్ధంగా జరిగే సాయం అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని, పంట నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. మొక్కజొన్న పంట వేసేందుకు ఎకరాకు కనీసం రూ.15వేలు ఖర్చయిందని తెలిపారు. మొక్క దశలోనే ఈ మొత్తాన్ని ఖర్చు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

పంట నష్టం అంచనాలు

తుఫాన్ ప్రభావంతో మండలంలో మొక్కజొన్న 2వేల ఎకరాలలో, అపరాలు 4వేల ఎకరాలలో నష్టం సంభవించి ఉంటాయని రైతులు చెబుతున్నారు. ఎక్కువగా ఈ రెండు పంటలే రైతులు రబీ సీజనులో వేశామని పేర్కొంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాలను పొలాలకు వచ్చి అంచనా వేయలేదు. పంటలకు ఇన్సురెన్స్ కట్టమని మాకు చెప్పలేదు. దీని వలన తీవ్రంగా నష్టపోయామని చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటలకు ఇన్సురెన్స్‌లు చెల్లింపులు చేయడం అనేది లేదని, ఒకవేళ పంటలకు ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం వాటిల్లితే పరిహారాలు అందేవని రైతులు చెప్పారు.



నారాయణపురంలో దెబ్బతిన్న అపరాలు



చిలకలపల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న

రబీ సీజన్‌లో పంటల వివరాలు...

పంట	సాగు (ఎకరాల్లో...)	ఈ క్రాప్ జరిగినది (ఎకరాల్లో...)
పెసర	800	674
మినుగులు	2,100	1,953
మొక్కజొన్న	2,000	1,814
వరి	300	135

వ్యవసాయశాఖ అంచనా

తుఫాన్ ప్రభావంతో పంటలకు 200 ఎకరాలలో మాత్రమే నష్టం వాటిల్లినట్టు అంచనా వేశామని ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు తెలిపారు. రబీలో ఇప్పటికి అన్ని రకాల పంటలకు సంబంధించి 4,600 ఎకరాలకు ఈ క్రాప్ చేయడం జరిగిందన్నారు. దీనిలో ఇప్పటికి 1,866 మంది ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు.

పంట నష్టం అంచనా వేయలేదు..

తుఫాన్ ప్రభావంతో పంటకు వాటిల్లిన నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఎవరూ అంచనా వేయలేదు. నాది మొక్కజొన్న 2ఎకరాలు, అపరాలు 4ఎకరాలకు నష్టం వాటిల్లింది. దీని వలన సుమారు రూ.35వేల వరకు నష్టపోయాను. ప్రభుత్వం పరిహారం అందించే చర్యలు చేపట్టకపోవడం దారుణం.

– ఆర్.సత్యం, రైతు, చిలకలపల్లి

33శాతం కంటే తక్కువ ఉంటే ప్రతిపాదనలు ఉండవు

పంట నష్టం 33శాతానికి తక్కువగా ఉంటే నష్టపరిహారాలకు ప్రతిపాదనలు చేసేందుకు అవకాశాలు లేవు. మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లితే మొక్క ఎదుగుదలకు రావాలంటే తగు సూచనలు అందించడం జరిగింది.

– శ్రావణ్‌కుమార్‌నాయుడు, ఏఓ, బలిజిపేట

రేపటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు



వీరఘట్టం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు

వీరఘట్టం:

క్షేత్రస్థాయిలో ఆరోగ్య సర్వేలు పక్కాగా చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్‌మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. వీరఘట్టం పీహెచ్‌సీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి కుష్టు రోగుల గుర్తింపును పక్కాగా చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి, వివరాలు నమోదు చేయాలన్నారు. చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని ఎర్ర మచ్చలుంటే కుష్టుగా అనుమానించాలన్నారు. వెంటనే సమీప పీహెచ్‌సీల్లో అటువంటి వారికి పరీక్షలు చేయించాలన్నారు. సమావేశంలో వీరఘట్టం పీహెచ్‌సీ డాక్టర్ ప్రదీప్‌కుమార్, డెమో వై.యోగీశ్వర రెడ్డి, డీఎస్ఓ శంకర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పీహెచ్‌సీ ఆవరణలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు.